డ్రెయినేజీ కాలువను పరిశీలిస్తున్న నాయకులు

పంచాయతీ కార్యదర్శులకు అదనపు భారం...

- ఎంపిడిఒ కార్యాలయంలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఉద్యోగస్తుల ఆవేదన

ప్రజాశక్తి-పత్తికొండ

గ్రామాలే దేశానికి పట్టు కొమ్మలు. గ్రామీణాభివృద్ధికి సంబంధించిన ఏ ప్రభుత్వ కార్యక్రమం అయినా గ్రామంలోని ప్రజల కోసమే రూపొందిస్తారు. గ్రామాభివృద్ధి కోసం రూపొందించిన వ్యూహాలు, పథకాలు ప్రజల దగ్గరకు చేరేందుకు, గ్రామీణ స్థాయిలో అన్ని ప్రభుత్వ పథకాల అమలు పర్యవేక్షించేందుకు ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించేందుకు గ్రామంలో ప్రభుత్వ ప్రతినిధి ఉండటం అవసరం. అందుకు అవసరమైన 17 పంచాయతీలకు ఏడుగురు కార్యదర్శులు మాత్రమే మాత్రమే ఉన్నారు. వారిలో గ్రేడ్ 2,3,4 కార్యదర్శులు ఏడుగురు ఉన్నారు. వారికి మాత్రమే చెక్‌పవర్ ఉంది. మిగ్రేడ్ 5 కార్యదర్శులు తొమ్మిది మంది ఉన్నారు. వారికి ఎలాంటి చెక్‌పవర్ లేదు. దీనికి తోడు పత్తికొండ ఎంపిడిఒ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి లేనందున ఆబాధ్యతలు కూడా పంచాయతీ కార్యదర్శులే అదనపు బాధ్యతులు చూసుకోవాలి. దీంతో పని భారం పెరిగి ఇబ్బందులు పడుతున్నారు. వారిలో పత్తికొండలో జీతం తీసుకునే అధికారులు ఇతర మండలాల్లో డిప్టేషన్ మీద పని చేస్తున్నారు.

గ్రామ పంచాయితీ అధిపతిగా, ప్రజలకు బాధ్యునిగా సర్పంచి ఉండినా, ప్రభుత్వ పథకాలు, ఉత్తర్వులు, ఇతర సంబంధిత సమాచారం అందక ప్రజలు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడేవారు. గ్రామస్థాయిలో అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయపరిచి, సమగ్ర సమాచారం సేకరించి, ప్రజాప్రతినిధులకు అందజేయడానికే, ప్రజలకూ, ప్రభుత్వానికీ వారధిగా ఒక ప్రభుత్వ ఉద్యోగి ఉండాల్సిన అవసరాన్నీ గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయితీకి ఒక గ్రామ పంచాయితీ కార్యదర్శిని నియమించింది. పత్తికొండ నియోజకవర్గ కేంద్రంలోని అదనపు బాధ్యతలతో పని భారం ఎక్కువవుతుందని గ్రామ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండ మండలంలోని 30 గ్రామాలకు గాను 17 గ్రామపంచాయతీలు ఏర్పాటు చేశారు.

గ్రామ పంచాయతీలు

పత్తికొండ ,హోసూరు, పుచ్చకాయలమాడ, దూదేకొండ, దేవనబండ, చిన్న హుల్తి, పెద్దహుల్తి, నలకదొడ్డి, జూటూరు, కోతిరాల, చందోలి ,చక్రాల, పందికోన, మండగిరి, పులికొండ, గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారు.

మజరా గ్రామాలు

పత్తికొండలో రామచంద్రాపురం, కొత్తిరాలలో కనక దిన్నె, పులికొండలో కొత్తపల్లి, దూదేకొండలో జెఎం తండా, మండగిరిలో అగ్రహారం, నలకదొడ్డిలో అటికెల గుండు, చక్రాల లో కురువలదొడ్డి, మరిమాంతండ, చందోలిలో దేవకుంట గ్రామాలను కలిపి మజారా గ్రామాలుగా ఏర్పాటు చేశారు.

సుమారు 80 వేల జనాభా జీవనం సాగిస్తున్నారు. పత్తికొండ మండలం గ్రామ సచివాలయం కార్యదర్శులు 9, గ్రేడ్ 2,3,4 కార్యదర్శులు ఏడుగురు ఉన్నారు. అన్ని గ్రామ పంచాయతీకి కార్యదర్శులు లేకపోవడంతో పారిశుధ్య పనులు, నీటి సరఫరా, అనేక సమస్యలు, మరిన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సరైన సమయానికి పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ కార్యకలాపాల కోసం వచ్చి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రేడ్ 5 గ్రామ సచివాలయ కార్యదర్శులకు చెక్‌పవర్ లేకపోవడంతో గ్రేడ్ 2,3,4 పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒక్కో కార్యదర్శి రెండు మూడు గ్రామాలను అప్పగించారంటూ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంపిడిఒ కార్యాలయంలో వేధిస్తున్న సిబ్బంది: పత్తికొండ మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది కొరత, ఉన్న సిబ్బంది పని భారం అధికమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఇఒఆర్‌డి, టైపిస్ట్, అటెండర్ సిబ్బందితో పరిపాలన కొనసాగాలి. ప్రస్తుత ఎంపిడిఒ ,జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్‌తో పరిపాలన కొనసాగుతుంది. సూపరిన్‌టెన్‌డెంట్ పత్తికొండలో జీతం తీసుకుంటూ క్రిష్ణగిరిలో విధులు నిర్వహిస్తున్నారు. ఇఒఆర్‌డి పత్తికొండలో జీతం తీసుకుంటూ పాణ్యంలో విధులు నిర్వహిస్తున్నారు. సీనియర్ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

విధులకు ఆటంకం

- పంచాయతీ సెక్రటరీ మునిస్వామి

పంచాయతీ సెక్రటరీగా హోసూరు గ్రామానికి కేటాయించారు. కోతిరాల, పందికోన పంచాయతీకి పత్తికొండ ఇఒఆర్‌డి ఇన్చార్జిగా నియమించారు. గ్రామాలలో ప్రజలకు పరిపాలన అందించడానికి, విధులకు ఆటంకం, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చాలి

- ఓపెన్ డ్రెయినేజీలకు మరమ్మతులు చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరం ప్రధాన రోడ్లలో పైపులైన్ల కోసం తవ్విన గుంతలకు మరమ్మతులు చేయకపోవడం వలన 5-6 అడుగుల విస్తీర్ణం గల కాలువలపై ఆర్‌సిసి స్లాబులు వేయకుండా వదిలేయడంతో ప్రజలు ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తుందని బిఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు ఎస్‌కె.షబ్బీర్, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎం.నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వివిధ ప్రాంతాల్లో రోడ్ల గుంతల పక్కన పట్టణ పౌర సంక్షేమ సంఘం సభ్యులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రామలింగేశ్వర్ నగర్‌లో మంజూరైన రూ.కోటితో పున్నమి గెస్ట్ హౌస్ ఎదుట రోడ్డు పక్కన రోడ్డు, రోడ్డు మధ్య ట్రాఫిక్ డివైడర్ వేశారు. ఏడాది గడుస్తున్నా... కాలువపై ఆర్‌సిసి స్లాబు వేయనందువల్ల వాహనదారులు నరకం అనుభవిస్తున్నారని అన్నారు. ఎక్కువ ఆదాయం వచ్చే పనులు మాత్రమే చేసి కష్టంగా ఉండే పనులు వదిలేస్తారా? అని ప్రశ్నించారు. బళ్లారి చౌరస్తా నుండి రాజీవ్‌నగర్ వరకు దాదాపు రూ.50 లక్షలతో తారు రోడ్డు పక్కన సిమెంట్ రోడ్డు వేశారు. ఆరు అడుగులకు పైగా విస్తీర్ణంగల మురుగు కాలువపై ఆర్‌సిసిస్లాబ్ వేయకుండా వదిలేశారు. ఏడాది గడుస్తున్నా ఇంజనీర్లు అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదు. గుంతలు పడిన రోడ్లు వెంటనే మరమ్మతులు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలిచ్చినప్పటికీ స్థానిక ఆర్‌అండ్‌బి, నగరపాలక సంస్థ ఇంజనీర్లు మాత్రం స్పందించడం లేదు. ఈద్గా ఎదురుగా పైపులైను కోసం రోడ్డును తవ్వినెల రోజులు గడుస్తున్నా మరమ్మతులు చేయకపోవడంతో రోజు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. నగరంలో ప్రధాన రోడ్లపై ప్రమాదకరమైన గుంతలు గురించి తెలుసుకునేందుకు ఇంజనీర్లు రోడ్లపై పర్యటించకుండా ఆఫీసులకే పరిమితమయ్యారని అన్నారు. ప్రజా ప్రతినిధులు కూడా ప్రజల సమస్యలపై తగినంతగా స్పందించడం లేదన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి గుంతలపడిన రోడ్ల సమస్య పరిష్కరించాలని కోరారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన నిరసనలో సంఘం నగర నాయకులు కె.శ్రీను, టి.పురుషోత్తంరెడ్డి, ఎండి యూనుస్, సివి.వర్మ, ఎస్.అన్వర్, డి.ప్రభాకర్‌రెడ్డి, ఎస్.ఉజేర్‌అహ్మద్, ఎల్.నయుం, జి.లక్ష్మన్న, టి.కృష్ణ, కె.వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు పక్కా ఏర్పాట్లు

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో పంద్రాగస్టు స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను మొక్కుబడిగా కాకుండా దేశ, రాష్ట్ర జిల్లా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ దేశభక్తి భావన ఉట్టిపడే విధంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులను వేడుకలకు ఆహ్వానించాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పిల్లలు ఎండలో ఇబ్బంది పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, 30 నుండి 45 నిమిషాలు మాత్రమే పెర్ఫార్మెన్స్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆశయాలు జిల్లా ప్రగతి లక్ష్యాలు, పురోగతి పై స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని రూపొందించాలని ఆదేశించారు. పరేడ్ గ్రౌండ్లో వేదిక, జాతీయ జెండా ఏర్పాటు, మార్చ్ ఫాస్ట్, శానిటేషన్ , తాగునీరు తదితర ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. డ్వామా, హౌసింగ్, వ్యవసాయ, వైద్య ఆరోగ్య, విద్య, సర్వ శిక్ష అభియాన్, ఇరిగేషన్, అటవీశాఖ, సంక్షేమ శాఖలు ప్రగతి శకటాలను రూపొందించాలన్నారు. డిఆర్‌డిఎ, ఎస్‌సి కార్పొరేషన్, హార్టికల్చర్, ఐసిడిఎస్ తదితర శాఖలు ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ మధుసూదన్ రావు, డిఎస్‌పి శ్రీనివాసరావు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాష

ఆదుకోలేని రేషన్..!

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్యులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మార్కెట్‌లో ఏ నిత్యావసర వస్తువు కొనుగోలు చేసినా ధరలు అధికంగా ఉండడంతో తప్పనిసరి పరిస్థితిలో కొనాల్సి వస్తోంది. ఆహార భద్రత చట్టం ఉన్నప్పటికీ రేషన్ కార్డుదారులకు మాత్రం భరోసా దక్కడం లేదు. కార్డుదారులకు కేవలం ప్రభుత్వం రేషన్ బియ్యం మాత్రమే ఉచితంగా అందజేస్తుండగా అప్పుడప్పుడు కందిపప్పు, చక్కెర కూడా అందజేస్తోంది. సబ్సిడీ కింద నిత్యావసర సరుకులు అందజేయాలని కార్డుదారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1228 రేషన్ షాపులు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 6,76,209 తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం రేషన్ కార్డుదారులకు బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నారు. రాగి పిండి, చక్కెర, కందిపప్పు కొంతమంది కార్డుదారులకు మాత్రమే సరఫరా జరుగుతోంది. కార్డుదారులందరికీ పూర్తిస్థాయిలో నిత్యాసర సరుకులు అందడం లేదు. ఆగస్టు నెల నుంచి కార్డుదారులందరికీ సరఫరా చేస్తున్నట్లు పౌరసరఫరా శాఖ ప్రకటించింది. గతంలో కొంతమంది కార్డుదారులకు సరఫరా చేసి చేతులెత్తేసిన దాఖలాలు ఉన్నాయి. ఈసారి కూడా కార్డుదారులందరికీ సరఫరా చేయడం లేదు. ఇటీవల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రేషన్‌లోనూ సరుకులన్నీ ఇవ్వకపోవడంతో సామాన్యుల జేబులు ఖాళీ అవుతున్నాయి.

రాజ్యమేలుతున్న దోమలు...

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కర్నూలు నగరపాలక సంస్థతో పాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మండలాల్లో దోమల నివారణ చర్యలు కనిపించడం లేదు. ప్రజారోగ్యానికి రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. దోమల బెడదతో జనం బెంబేలెత్తిపోతున్నారు. పారిశుధ్య లోపం కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం కర్నూలు జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకూ 193 డెంగీ కేసులు నమోదయ్యాయి. నాలుగు మలేరియా కేసులు నమోదయ్యాయి. నంద్యాల జిల్లాలో 110 డెంగీ కేసులు నమోదయ్యాయి. రెండు మలేరియా కేసులు నమోదయ్యాయి. ఎలీసా టెస్టుల ద్వారా పాజిటివ్ వచ్చిన మాత్రమే అధికారులు డెంగీ కేసులుగా పరిగణిస్తున్నారు. అనధికారికంగా ఈఏడాది నమోదైన డెంగీ కేసులు వేలల్లో ఉన్నట్లు అంచనా.

జలాశయాలకు పోటెత్తిన వరద...

శ్రీశైలం, తుంగభద్ర జలాశయాలకు వరద నీటి ప్రవాహం పోటెత్తింది. ఎగువన ఆల్మట్టి, జూరాల జలాశయాల గేట్లను ఎత్తి కిందికి నీటిని విడుదల చేస్తుండడంతో శ్రీశైలం జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతున్నాయి. జూరాల, సుంకేసుల నుంచి నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతున్నాయి. డ్యామ్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరో వైపు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌కు వరద నీరు పోటెత్తాయి. తుంగభద్ర డ్యామ్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జిల్లాలోని తుంగభద్ర నది నీటితో కళకళలాడుతోంది.

ముఖ్యమంత్రి పర్యటన...

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీశైలంలో పర్యటించారు. ఉండవల్లి నుంచి హెలిక్యాప్టర్ ద్వారా సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా శ్రీశైలం వెళ్లి భ్రమరాంబ, మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీశైలం ప్రాజెక్ట్ వద్దకు చేరుకుని రాయలసీమ ప్రాజెక్టుల ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కృష్ణా నదికి జలహారతి ఇచ్చి కృష్ణమ్మకు చీర, సారె సమర్పించారు. అనంతరం సున్నిపెంట పాఠశాల ఆవరణలో 'మన నీరు..మన సంపద' పేరుతో నీటి వినియోగదారుల సంఘం ప్రతినిధులతో చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు.

మాట్లాడుతున్న ఆర్ఐ రామాంజనేయులు

'శ్రీ చైతన్య 'జాతీయ పతాక ప్రదర్శన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం జాతీయ పతాక ఆవిష్కరణకర్త పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని 50 అడుగుల అతిపెద్ద జాతీయ పతాక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ చైతన్య పాఠశాలల ఎజిఎం సురేష్ ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపల్ వై.మంజుల ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు నగర వీధుల గుండా భారతమాతను నినదిస్తూ నినాదాలు చేస్తూ ప్రదర్శనగా కందనవోలు చారిత్రక కట్టడమైన కొండారెడ్డి బురుజు వరకు వెళ్లారు. ముఖ్య అతిథులుగా వచ్చిన ఆర్ఐ రామాంజనేయులు, కోఆర్డినేటర్ నాగేశ్వరరావు మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులలో దేశభక్తిని, ప్రజలలో చైతన్యాన్ని కలిగించేందుకు దోహదపడతాయని తెలిపారు. పాఠశాల ఎఒ పరమేశ్వర రెడ్డి, డీన్ రాజేష్, ప్రైమరీ ఇన్‌ఛార్జులు రాణి, సుజాత, రోజా, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపద ప్రబంధన్ అవార్డుకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విపత్తు నిర్వహణ రంగంలో వ్యక్తులు, సంస్థలు అందించిన అమూల్యమైన సహకారాన్ని, నిస్వార్థ సేవలను గుర్తించి వారిని గౌరవించేందుకు గాను భారత ప్రభుత్వం సుభాష్ చంద్రబోస్ ఆపద్ ప్రబంధన్ పురస్కార్ –2025 అనే వార్షిక అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డును ప్రతి సంవత్సరం జనవరి 23 వ తేదిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి నాడు ప్రకటిస్తామన్నారు. ఈ అవార్డు పారితోషికం సంస్థకు అయితే రూ.51 లక్షలు, వ్యక్తులకు రూ.5 లక్షలు ఉంటుందన్నారు.

డిఐజిని కలిసిన ఎమ్మెల్యే దస్తగిరి, తిక్కారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్‌ను కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి శనివారం కర్నూలు నగరంలోని బి క్యాంపు లో ఉన్న డిఐజి క్యాంపు కార్యాలయంలో మర్యాదగాపూర్వకంగా కలిసి పూల బొకేను అందజేశారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని వారు కోరారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు

618 షాపులలో ఆకస్మిక తనిఖీలు
వారంలో 215 కేజీల ప్లాస్టిక్ స్వాధీనం
విక్రయదారులకు రూ.50,250 జరిమానా

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

నగరంలో ప్లాస్టిక్ వాడకం మళ్ళీ పెరిగిపోవడంతో వాటిపై నగరపాలక సంస్థ ఉక్కుపాదం మోపుతోంది. కమిషనర్ పివి. రామలింగేశ్వర్ ఆదేశాలతో శానిటేషన్ ఇంస్పెక్టర్లు, సెక్రటరీలు వారం రోజులుగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టి, విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. పట్టుబడ్డ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను ఎక్కడిక్కడ సీజ్ చేస్తున్నారు. దాంతోపాటు విక్రయదారులపై జరిమానాలు విధిస్తున్నారు. కమిషనర్ రామలింగేశ్వర్ ప్రతిరోజూ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తూ, ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించేందుకు తగు ఆదేశాలు, సూచనలు జారీ చేస్తుండడంతో, క్షేత్ర స్థాయిలో సిబ్బంది విస్తృతంగా పర్యటిస్తూ, ప్లాస్టిక్ అమ్మకపు దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం: కమిషనర్

పర్యావరణాన్ని పాడు చేసే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను భూతాన్ని తరిమికొడదామని ప్రజలకు నగరపాలక కమిషనర్ పివి. రామలింగేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. గత వారం రోజులుగా ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై దాడులు చేసి, పట్టుబడ్డ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుంటున్నామని కమిషనర్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి స్థాయిలో నిర్మిలించేంత వరకు దాడులు కొనసాగుతాయని అమ్మకపుదారులకు హెచ్చరించారు. నగరంలో మొత్తం 16 డివిజన్లలలో 618 షాపులపై ఆకస్మిక తనిఖీలు చేపట్టి, 215 కేజీల ప్లాస్టిక్‌ను సీజ్ చేశామన్నారు. విక్రయదారులకు రూ.50,250 జరిమానా విధించామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ నివారణకు ప్రజలు, విక్రయదారులు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు.

దుకాణాలలో తనిఖీలు చేస్తున్న కెఎంసి సిబ్బంది

ఈ - పంట నమోదు వేగవంతం చేయాలి : ఎఒ

ప్రజాశక్తి -సి బెళగల్

రైతులకు ఈ పంట నమోదును వేగవంతం చేయాలని ఎఒ మల్లేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఆయా పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఏఏ పంటలు సాగు చేశారో ఆధార్, బ్యాంకు అకౌంట్, పట్టా పాసు బుక్కు జిరాక్సులతో వెళ్లి రైతు సేవా కేంద్రంలో నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. అందుకు అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు.

ఎస్‌సిలకు అన్యాయం జరిగితే సహించం

ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టరీ ప్రసాద్

ప్రజాశక్తి-మద్దికేర : ఎస్‌సిలకు అన్యాయం జరిగితే సహించబోమని, ప్రభుత్వం ఎస్‌సిలకు కేటాయించిన ఇంటి స్థలాలను పూర్తిస్థాయిలో వారికే అందజేయాలని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. శనివారం మద్దికేర మండల కేంద్రంలో సర్వేనెంబర్ 444/2డి ఎస్‌సిలకు ఇచ్చిన స్థలాన్ని, ఇంటి స్థలాల కోసం ఆత్మహత్య యత్నం చేసుకున్న దళిత నాయకుడు రాఘవేంద్రను పరామర్శించి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 లో అప్పటి ప్రభుత్వం సర్వే నంబర్ 444/డిలో 124 ఇంటి స్థలాలను ఎస్‌సిలకు మంజూరు చేసిందన్నారు. కేవలం 54 మందికి మాత్రమే కేటాయించి మిగిలిన వారికి కేటాయించకుండా అధికారులపై ఒత్తిడి తెచ్చిన వారిపై పోరాటం చేసి గత 8 నెలల క్రితం దళిత నాయకుడు రాఘవేంద్ర ఆత్మహత్యయత్నం చేసుకోగా మెరుగైన వైద్యం అందించడం వలన ప్రాణాపాయం నుండి బయటపడ్డాడని అన్నారు. దళితుల సంక్షేమంపై నిర్లక్ష్యం చేసిన వారిపై ఎస్‌సి కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. దళితులకు భద్రత కల్పించాలని ఎస్‌సి కమిషన్ చైర్మన్ పోలీసులను ఆదేశించారు. దళితులకుఇంటి స్థలాలు పూర్తిస్థాయిలో పంపిణీ జరిగేలా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా తక్షణమే అక్కడ ప్రత్యక్షమై దళితుల కోసం న్యాయం చేకూరు స్తామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం హయాంలో మాదిగల సమస్యలను పరిష్కరించే విధంగా సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తారన్నారు. పార రాఘవేంద్ర, సర్పంచి బండారు సుహాసిని, పంచాయతీ సలహాదారుడు బండారు ఆంజనే యులు, డిప్యూటీ తహశీల్దారు పురుషోత్తం, ఎస్ఐ రమేష్ బాబు, విఆర్ఒలు స్థానికులు సంజీవ నాగరాజు, బొజ్జయ, ఆనందు, రాము పాల్గొన్నారు.

మద్దికేరలో ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టరీ ప్రసాద్ పర్యటన

మాట్లాడుతున్న డిఇఒ కె. శామ్యూల్

వచ్చేవారం నుండి వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ

డిఇఒ కె. శామ్యూల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వచ్చేవారం నుండి ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ ఆన్‌లైన్‌లో ప్రారంభమవుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి కె శామ్యూల్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్లోని సమగ్ర శిక్ష అభియాన్ సమావేశ భవనంలో విద్యాశాఖ అధికారుల సమావేశం నిర్వహించారు. డిఇఒ మాట్లాడుతూ జిల్లాలో త్వరలోనే పాఠశాల విద్యాశాఖ కమిషనర్ , కార్యదర్శి పర్యటనలు ఉంటాయని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా నివేదికలను సిద్ధం చేసుకోవాలని కోరారు. ఎస్ఎంసి కమిటీ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. బడి బయట ఉన్న పిల్లల్ని పాఠశాలల్లో ఉండేలా చూడాలని కోరారు. పాఠశాలలకు స్కూల్ గ్రాంట్ నిధులు కూడా త్వరలో విడుదల అవుతాయని పేర్కొన్నారు. నివేదికలను కూడా పక్కాగా తయారుచేసి పంపాలని కోరారు. ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయన్నారు. ఈ సమావేశంలో పాఠశాల అసిస్టెంట్ డైరెక్టర్ సౌమ్యూల్‌పాల్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషన్, ఆదోని డిప్యూటీ డిఇఒ ఎంఇఒలు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరించండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సత్వరం పరిష్కారించాలని నగరపాలక సంస్థ మేనేజర్ చిన్నరాముడు సచివాలయ సిబ్బందికి సూచించారు. శనివారం కమిషనర్ పివి. రామలింగేశ్వర్ ఆదేశాల మేరకే చల్లా కాంపౌండ్‌లో 121వ సచివాలయాన్ని మేనేజర్, క్లర్క్ రామకృష్ణ ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సమస్యల పరిష్కారంలో ప్రజలు సంతృప్తి చెందేలా వ్యవహరించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం, గైర్హాజరు కావడం జరిగితే చర్యలు తప్పవన్నారు.

వర్సిటీ అభివృద్ధికి సహకరిస్తాం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

టిజివిని కలిసిన ఆర్‌యు విసి

రాయలసీమ వర్సిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తానని రాజ్యసభ మాజీ సభ్యులు టిజి వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం రాయలసీమ వర్సిటీ వైస్ ఛాన్సలర్ , ఎన్‌టికె నాయక్ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ పి వెంకటేశ్వర్లు టిజి వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్సిటీలో సమస్యలపై టిజి వెంకటేష్ అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు టిజి వెంకటేష్ ఫోన్ ద్వారా సూచించారు. స్టేడియం అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న వైద్యులు డాక్టర్ మాలకొండయ్య

సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో కార్మిక నేత కీర్తిశేషులు టి.షడ్రక్ 4వ వర్థంతి సందర్భంగా పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో శాంతి నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ మాలకొండయ్య, తేజ హాస్పిటల్ నిర్వాహకులు, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ రవితేజ రెడ్డి, భరత్ డెంటల్ క్లినిక్ నిర్వాహకులు, దంత వైద్యులు డాక్టర్ భరత్ కుమార్ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 130 మందికి పైగా పరీక్షల నిర్వహించుకున్నారు. బిపి, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అలాగే పరీక్షలు నిర్వహించిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో వివిధ హాస్పిటల్స్ సిబ్బంది రాజు, దుర్గన్న, నవీన్, శాంతి, నవీన, ప్రవీణ్ కుమార్, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నిర్వాహకులు, జిల్లా కో కన్వీనర్ రంగస్వామి, సభ్యులు బి.రామాంజనేయులు, గోవిందు, సురేష్, లక్ష్మీ నరసయ్య, రాఘవరెడ్డి, అబ్దుల్లా, రంగప్ప, రాజు, వెంకటేశ్వర్ శెట్టి, రమేష్, కృష్ణ, రాముడు, సుభాన్, పరమేష్, రవికుమార్, రంగయ్య, దేవేంద్రమూర్తి పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గోకులం షెడ్డు నిర్మాణానికి మోక్షం

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- సన్న, చిన్న కారు రైతులకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

గోకులం షెడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత టిడిపి హయాంలో గోకులం షెడ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. 2019 ఎన్నికల్లో గెలిచి వైసిపి అధికారంలోకి వచ్చింది. గోకుల షెడ్ల నిర్మాణాలు అటకెక్కాయి. మళ్లీ ఇప్పుడు టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో ఈ నిర్మాణాలకు చర్యలు చేపడుతోంది.

గోకులం షెడ్డు నిర్మాణం (ఫైల్)

అత్యంత వెనుకబడిన ఆదోని డివిజన్ ప్రాంతంలోని ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాల్లో వ్యవసాయానికి అనుబంధంగా రైతులు పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులను ఆదుకునేందుకు గతంలో టిడిపి హయాంలోనే గోకులం పథకం కింద పశువులను పెంచేందుకు మినీ షెడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. తర్వాత వైసిపి అధికారంలోకి రావడంతో ఈ పథకం పడకేసింది. ఈ పథకానికి ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. ప్రస్తుతం ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రావడంతో ప్రభుత్వం వెంటనే స్పందించింది. మినీ గోకులం పథకం పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది. గతంలో మాదిరిగానే పశుపోషకులకు 90 శాతం, జీవాలు, కోళ్ల పెంపకందారులకు 70 శాతం రాయితీతో షెడ్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఉన్నతాధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు. ఆదోని డివిజన్ ప్రాంతానికి 750 మినీ గోకులం షెడ్లను లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు ఉపాధి హామీ చట్టం నుంచి నిధులు ఇవ్వనున్నారు.

2 పశువులకు మినీ గోకులం యూనిట్ విలువ రూ.1.15.000, ఉపాధి హామీ నిధులు రూ.1,03,500, రైతు వాటా రూ.11500 ఉంటుంది. 4 పశువులకు మినీ గోకులం యూనిట్ విలువ రూ.1.85.000 కాగా ఉపాధి హామీ నిధులు రూ.1,66,500, రైతు వాటా రూ.18,500 ఉంటుంది. 6 పశువులకు మినీ గోకులం యూనిట్ విలువ రూ.2,30,000, ఉపాధి హామీ నిధులు రూ.2,07,000, రైతు వాటా రూ.23,000గా ఉంటుంది.

గొర్రెలు/మేకల షెడ్డు

20 జీవాల షెడ్డు యూనిట్ విలువ రూ.1,30,000, ఉపాధి హామీ నిధులు రూ.91,000, రైతు వాటా రూ.39,000గా ఉంటుంది. 50 జీవాల షెడ్డు, యూనిట్ విలువ రూ.2,30,000, ఉపాధి హామీ నిధులు రూ.1,61,00, రైతు వాటా రూ.69,000గా ఉంటుంది.

కోళ్ల షెడ్డు

100 కోళ్ల షెడ్డు యూనిట్ విలువ రూ.87,000, ఉపాధి హామీ నిధులు రూ.60,900, రైతు వాటా రూ.26,100గా ఉంటుంది. 200 కోళ్ల షెడ్డు, యూనిట్ విలువ రూ.1,32,000, ఉపాధి హామీ నిధులు రూ.92,400, రైతు వాటా రూ.39,600గా ఉంటుంది.

సొంత స్థలమున్న రైతులకు ప్రాధాన్యత

షెడ్ల నిర్మాణానికి సొంత స్థలం ఉన్న చిన్న, సన్న కారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మండలాల్లో పాడి పశువులు, గొర్రెలు, కోళ్ల పెంపకానికి అనుగుణంగా యూనిట్లు కేటాయించేలా కసరత్తు చేపట్టారు. అర్హులైన రైతులు సంబంధిత పశు వైద్యాధికారులను సంప్రదించి దరఖాస్తు అందజేయాలి.

బిల్లులు రాని లబ్ధిదారుల సంగతి ఏమిటి..?

2018లో టిడిపి ప్రభుత్వ హయాంలో ఆదోని డివిజన్‌లో 500కిపైగా గోకులం షెడ్లు మంజూరయ్యాయి. వాటిలో చాలా మంది రైతులు తమ వాటాను జమ చేసి నిర్మాణాలను ప్రారంభించుకున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం పూర్తయిన గోకులాల నిర్మాణాలకు బిల్లుల చెల్లింపులో చొరవ చూపలేదు. చాలా మంది లబ్ధిదారులకు నేటికీ బిల్లులు అందలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం బిల్లులు రాని లబ్ధిదారులకు పాత బిల్లులు చెల్లిస్తారా లేదా అనే సందేహంలో పడ్డారు. అధికారులను వివరణ కోరగా ఇప్పటివరకు అలాంటిది ప్రభుత్వం ఏం చెప్పలేదని, గత ప్రభుత్వాల హయాంలో నిర్మించిన గోకులం షెడ్డు నిర్మాణాల వివరాలు అందజేయమంటే, అందజేసేందుకు కృషి చేస్తామని వివరించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

గోకులాలకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. షెడ్ల నిర్మాణానికి సొంత స్థలం ఉన్న చిన్న, సన్న కారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మండలాల్లో పాడి పశువులు, గొర్రెలు, కోళ్ల పెంపకానికి అనుగుణంగా యూనిట్లు కేటాయించేలా కసరత్తు చేపట్టారు. అర్హులైన రైతులు సంబంధిత పశు వైద్యాధికారులను సంప్రదించి దరఖాస్తు అందజేయాలి.

అర్హులను ఎంపిక చేస్తాం

- వెంకటరమణ, పశుసంవర్ధక శాఖ డిడి, ఆదోని

ఉపాధి హామీ చట్టానికి అనుసంధానంగా గోకులం మినీ షెడ్ల నిర్మాణానికి లబ్ధిదారుల ఎంపిక చేపడతాం. అర్హులైన పాడిరైతులు, గొర్రెలు, మేకలు, కోళ్ళ పెంపకందారులు సంబంధిత పశు వైద్యాధికారిని సంప్రదించి దరఖాస్తు అందజేయాలి. పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తాం. గోకులం షెడ్డు అప్లికేషన్‌తో పాటు ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, స్థలం హక్కు పత్రం, బ్యాంకు పాసు పుస్తకం జత చేసి స్థానిక పశు వైద్యాధికాలను సంప్రదించాలని సూచించారు.

బిల్లేకల్లు ఘర్షణలో ఇరుగ్రూపులపై కేసు

- డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - ఆస్పరి

మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఘర్షణలో ఇరుగ్రూపులపై కేసు నమోదు చేసినట్లు పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిల్లేకల్లు కూరగాయల మార్కెట్‌లో వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో వైసిపికి చెందిన చింత్తమాను వెంకటేష్ ఫిర్యాదు మేరకు టిడిపి నాయకులు వీరేంద్ర, వీరేష్, వీరాంజనేయులు, శ్రీను, నాగరాజు, మురళీ, శేఖర్, రవి, ఉరుకుందుతో పాటు మరో 23 మందిపై కేసు నమోదు చేశామని తెలిపారు. టిడిపి నాయకులు ఈడిగ ఉరుకుంద ఫిర్యాదు మేరకు వైసిపి నాయకులు చింతమాను లక్ష్మీనారాయణ, ధనుంజయ, సూరి, రంగన్న, మల్లప్ప, రాజశేఖర్, సుంకన్న, జయరాముడు, కృష్ణ, ఎర్రోడుతో పాటు 25 మందికి కేసు నమోదు చేశామని చెప్పారు. ఘర్షణ పడిన ఇరు గ్రూపులను అదుపు చేయడానికి వెళ్లిన సిఐ హనుమంతప్పపై రాళ్ల దాడి చేసిన టిడిపి గ్రూపునకు చెందిన 10 మంది, వైసిపి గ్రూపునకు చెందిన 10 మందిపై కేసు నమోదు చేశామన్నారు. బిల్లేకల్లులో దాడి సందర్భంగా టిడిపికి చెందిన 42 మంది, వైసిపికి చెందిన 45 మందిపై కేసు నమోదయినట్లు తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా స్పెషల్ బ్రాంచి పోలీసులను రంగంలోకి దింపినట్లు చెప్పారు. ఇద్దరు సిఐలు, ఇద్దరు ఎస్‌ఐలు, 20 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామని వివరించారు.

కూరగాయల మార్కెట్‌ను ఆధీనంలోకి తీసుకున్న స్పెషల్ బ్రాంచి

ప్రజలకు రక్షణ ఏది..?

- చిప్పగిరి పోలీసు స్టేషన్‌లో వేధిస్తున్న సిబ్బంది కొరత
- 32 మందికి గాను 8, 10 మందే విధుల్లో
- అందులోనూ సెలవుపై వెళ్లే వారే ఎక్కువ - సమస్యాత్మక గ్రామాలపై కొరవడిన నిఘా

ప్రజాశక్తి - చిప్పగిరి

ఫ్యాక్షన్ భూతానికి పేరొందిన చిప్పగిరి మండలంలో పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. సిబ్బంది కొరత వల్ల ప్రజలకు రక్షణ కరువైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తం 32 మంది సిబ్బంది ఉండాల్సిన స్టేషన్‌లో 8, 10 మంది మాత్రమే విధుల్లో ఉంటున్నారు. అందులో కూడా సెలవుపై వెళ్లే వారు ఎక్కువగా ఉంటున్నట్లు సమాచారం. స్టేషన్‌లో సిబ్బంది లేకపోవడంతో సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించలేకపోతున్నట్లు తెలిసింది.

కర్నూలు జిల్లాకు పశ్చిమ సరిహద్దు మండలమైన చిప్పగిరికి చాలా గ్రామాలు మారుమూల ప్రాంతాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పూర్తిస్థాయి సిబ్బంది ఉంటే తప్ప స్థానికంగా ఉండే పోలీసు అధికారి లా అండ్ ఆర్డర్‌ను అదుపులో పెట్టే అవకాశం ఉంటుంది. చిప్పగిరి మండలంలో 13 పంచాయతీలకు గాను 16 గ్రామాలు ఉన్నాయి. మండలవ్యాప్తంగా 2011 జనాభా లెక్కల ప్రకారం 33,400 మంది జనాభా ఉన్నారు. మండలంలో డేగలపాడు, గుమ్మనూరు, బెల్డోన, నంచర్ల, చిప్పగిరి గ్రామాలు సమస్యాత్మకంగా ఉన్నాయి. వీటితోపాటు రామదుర్గం, బంటనహాల్, నేమకల్లు గ్రామాల్లో ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉంటుంది. ఒక గ్రామానికి ఒక పోలీసు బాధ్యత తీసుకోవడం పోలీసు స్టేషన్ రూల్స్ ప్రకారం గతంలో నుంచి వస్తోంది. ఆ రకంగా తీసుకున్నా 16 గ్రామాలకు 16 మంది పోలీసులు అవసరం ఉంటుంది. సిబ్బంది లేకపోవడంతో గ్రామాల్లో రోజురోజుకు అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువైపోతున్నాయని మండల ప్రజలు వాపోతున్నారు. గతంలో ప్రతి గ్రామానికీ ఒక పోలీసు బాధ్యత తీసుకునే వారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామంలో ఏ చిన్న సంఘటన జరిగినా ఆ సంఘటన పూర్వాపరాలు, ఆ బాధ్యత తీసుకున్న పోలీసుకు తెలుస్తుంది. ఆ సమయంలో ఉన్నతాధికారి ఎస్ఐకి పూర్తి సమాచారం తెలుసుకొని పరిష్కరించడానికి వెసలుబాటు ఉంటుంది. ప్రస్తుతం స్టేషనులో నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, నలుగురు పోలీసులు, ఒక మహిళా పోలీసు ఉన్నారు. సిబ్బంది లేకపోవడంతో గ్రామాల్లో చిన్న, చిన్న సంఘటనలకు కూడా ఆలూరు సిఐ దగ్గరకు వెళ్లాల్సి వస్తోందని పలు గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు. ఎస్ఐ వారం రోజులు సెలవుపై వెళ్లడంతో స్టేషన్‌లో ఉన్న కొద్దిపాటి సిబ్బంది కూడా గ్రామాల్లో తిరగలేకపోతున్నారు. ఏదైనా పెద్ద సంఘటన జరిగితే చాలా ఇబ్బందులు ఎదురవుతాయని, తప్పనిసరిగా ఎస్పీ స్పందించి చిప్పగిరి పోలీసు స్టేషన్‌కు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చిప్పగిరి పోలీసు స్టేషన్

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి తెలిపారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సుంకర ఉమాదేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే విరుపాక్షి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఒక్కో శాఖ గురించి మాట్లాడారు. ఆస్పరి గ్రామానికి నీరు సరిగా రావడం లేదని, 10, 15 రోజులకోసారి వదులుతున్నారని గ్రామస్తులు లక్ష్మీనారాయణ, మహేష్, రాజు, నరసింహులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి దృష్టికి ఎన్ని సార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్య తలెత్తకుండా పరిష్కరిస్తామని పంచాయతీ కార్యదర్శి హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మాట్లాడుతూ... ఆస్పరి మండలానికి రావాల్సిన నీరు రావడం లేదని, ఆదోని మండలంలోని ఐదు గ్రామాలకు కనెక్షన్ ఇవ్వడంతో ఆస్పరికి మండలానికి నీటి సమస్య తలెత్తిందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... జొహరాపురం గ్రామంలో స్టోరేజ్ సంపు ఏర్పాటు చేసి హోసూరు నుంచి కాలువ ద్వారా నీరు తెస్తే ఆస్పరి మండలానికి నీటి సమస్య ఉండదన్నారు. ఎఇ మాట్లాడుతూ... హోసూరు కాలువ నుంచి నీరు తీసుకురావడానికి రూ.120 కోట్లు ఖర్చు అవుతాయని తెలిపారు. అలాకాకుండా పందికోన రిజర్వాయర్ నుంచి పైపు లైన్ ద్వారా ఆస్పరికి నీరు తీసుకొస్తే రూ.50 కోట్లు ఖర్చు అవుతుందని చెప్పారు. అలా ఎస్టిమేషన్ వేస్తే ఆస్పరిలో ఒకటి రామతీర్థం కొండపై స్టోరేజ్ సంపు ఏర్పాటు చేస్తే మండలంలోని గ్రామాలకు నీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అలాగే ఎస్టిమేషన్ వేసి తమకు ఇస్తే కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ముందుగా ఎమ్మెల్యే విరుపాక్షికి ఎంపిడిఒ లక్ష్మి నారాయణ శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. జడ్‌పిటిసి దొరబాబు, తహశీల్దార్ శివ శంకర్ నాయక్, డిప్యూటీ తహశీల్దార్ గాయత్రి పాల్గొన్నారు.

తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని తహశీల్దార్‌గా ఆర్.శివరాముడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది తహశీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. డిప్యూటీ తహశీల్దార్ రుద్రగౌడ్, పెద్దయ్య, వలీబాష, సీనియర్ అసిస్టెంట్ ఖాసీం వలీ, లక్ష్మణ్ పాల్గొన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ ఛాంబర్‌లో ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మకు పుష్పగుచ్ఛం అందజేసి మర్యాద పూర్వకంగా కలిశారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన శివరాముడు

అవగాహన కల్పిస్తున్న అధికారులు

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

- ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వయంప్రభ

ప్రజాశక్తి - ఆదోని

పుట్టిన మొదటి గంట నుంచి ఆరు నెలల పాటు తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆహారమని, తల్లిపాలతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వయంప్రభ తెలిపారు. శనివారం సిడిపిఒ ఉమామహేశ్వరి సూచనల మేరకు ఆదోనిలోని ఎల్‌బి స్ట్రీట్ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలు శిశువును న్యూమోనియా, అతిసార తదితర ప్రమాదకర వ్యాధుల నుంచి కాపాడతాయని తెలిపారు. పిల్లల మేధస్సును మెరుగుపరచడంలో తల్లిపాలు దోహదపడతాయని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తామన్నారు. అంగన్వాడీ కేంద్రంలో లభించే ఫోర్టిఫైడ్‌రైస్, బ్యాళ్లు, నరూనె, పాలు, గుడ్లు, బాలామృతంపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కార్యకర్తలు శారద, ఈరమ్మ, నాగరత్న, ఎఎన్‌ఎం శంకరమ్మ, ఆశా కార్యకర్తలు ధనలక్ష్మీ, త్రివేణి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్

ప్రజాశక్తి - చిప్పగిరి

వీధుల్లో, ఇంటి చుట్టూ ఎవరో వస్తారు.. చేస్తారని చూడకుండా బాధ్యతగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామని పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్ తెలిపారు. శనివారం చిప్పగిరిలో వీధివీధిన తిరుగుతూ పంచాయతీ కార్మికుల చేత పరిసరాలను శుభ్రం చేయించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు, మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రెయినేజీలు, వీధులను పరిశుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్‌ను వేయించామని తెలిపారు. మహిళలు ఇంటి ముందు మురుగునీటిని, వేస్ట్ పదార్థాలను వేయకుండా ఉండాలన్నారు. వీధుల్లో ఎక్కడా నీరు నిల్వ లేకుండా ఉంటే దోమలు కూడా వ్యాప్తి చెందవన్నారు.

కార్మికుల చేత శుభ్రం చేయిస్తున్న సురేంద్రనాథ్

ప్రభుత్వ డిగ్రీ, ఐటిఐ కళాశాలలకు నిధులు కేటాయించి

భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ డిగ్రీ, ఐటిఐ కళాశాలలకు నిధులు కేటాయించి, భవన నిర్మాణ పనులు ప్రారంభించి, పూర్తి చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలూరులో ప్రభుత్వ డిగ్రీ, ఐటిఐ కళాశాలలకు సొంత భవనాలు లేక ప్రభుత్వ బాయ్స్ హైస్కూల్ నెంబర్-2 కొన్ని గదులను డిగ్రీ కళాశాల నేటికీ కొనసాగడం సిగ్గుచేటని తెలిపారు. ఇలాంటి పరిస్థితే ప్రభుత్వ ఐటిఐ కళాశాలకు కూడా ఉందన్నారు. 2008లో కళాశాల ఏర్పాటు చేస్తే నేటి వరకు సొంత భవనాలు లేవని తెలిపారు. బాయ్స్-1 హైస్కూల్‌లో కొన్ని గదులను ఐటిఐ కళాశాలకు ఇవ్వడంతో అదే భవనంలో కొనసాగు తోందని చెప్పారు. విద్యార్థి, యువజన సంఘాలు అనేక పోరాటాలు, ఉద్యమాలు చేస్తే 2019లో ఐటిఐ కళాశాలకు అగ్రహారం గ్రామం దగ్గర స్థలం కేటాయించారని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ ఐటిఐ కళాశాలకు స్థలం కేటాయించినా భవన నిర్మాణాలకు నిధులు మంజూరు కాలేదని చెప్పారు. ఈ ప్రాంత పాలకులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు కేటాయించేలా చేయాలని కోరారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ 20 మందితో ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా గిరిమూర్తి, మండల అధ్యక్షులుగా ఉమేష్, మండల ఉపాధ్యక్షులుగా మణి, మహేష్, సహాయ కార్యదర్శులు బసవరాజు, కిరణ్, భరత్, 13 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులు మైనా, గోవర్ధన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్లా

అవగాహన కల్పిస్తున్న యాజమాన్యం

పైథాన్‌తో మెరుగైన ఉద్యోగావకాశాలు

- భీమా ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

పైథాన్ ప్రోగ్రామింగ్ నేర్చుకోవడం ద్వారా మెరుగైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని భీమా ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ పిఎన్.విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం ఆదోనిలోని ఇంజినీంగ్ కళాశాలలో ఆరు రోజుల పైథాన్ ప్రోగ్రామింగ్ వర్క్‌షాపును 360 జిజిటిఎంజి హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వర్క్‌షాప్ డేటా సైంటిస్ట్ ప్రణమ్, శివ కుమార్ ప్రోగ్రామ్‌లోని వివిధ నైపుణ్యాలు, మెళకువలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రోత్సాహకాలు అందజేశారు. ప్రిన్సిపల్ జిఎస్.సురేంద్రబాబు, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ ఆల్బర్ట్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- మాలమహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది

ప్రజాశక్తి - చిప్పగిరి

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది తెలిపారు. శనివారం ఆలూరు వాసవీ కల్యాణ మండపంలో మాల మహానాడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రాల్లో అన్నదమ్ములుగా ఉన్న ఎస్సీల మధ్య వర్గీకరణ చిచ్చు పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్న బిజెపి ప్రభుత్వం దళితులను అణగదొక్కాలని చూస్తోందని విమర్శించారు. దళితులు రాజ్యాధికారి దిశగా ఎక్కడ ముందుంటారో అని భావించి గతంలో ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పును పక్కన పెట్టి రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఎస్సీలను ఎబిసిడిగా విభజించడం దారుణమని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా మాలలు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. మాల మహానాడు సీనియర్ నాయకులు వన్నూరు గోపాల్, నాగరాజు, బొజ్జప్ప, నగరూరు చంద్ర, చాగి లింగప్ప, వెంకట్ రాముడు, నాగరాజు, భరత్, గిరి మల్లప్ప, ఎల్ఐసి రాము, మల్లికార్జున, ఈరన్న పాల్గొన్నారు.

కరువు, వలసల నివారణకు చర్యలు చేపట్టాలి

- ఎన్‌వైఎస్ పట్టణ కార్యదర్శి వీరేష్

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న నాయకులు

రాయలసీమ పశ్చిమ ప్రాంతంలో పెండింగ్ ప్రాజెక్టు పూర్తి చేసి, పరిశ్రమలు స్థాపించి కరువు, వలసలు నివారించాలని ఎన్‌వైఎస్ పట్టణ కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌డిఎస్ కుడి కాలువను 8 టిఎంసిలతో పూర్తి చేయాలని, పులికనుమ ప్రాజెక్టు ఎత్తు పెంచాలని కోరారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి కొన్ని వందల టిఎంసిలు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయని తెలిపారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారంగా మన ప్రాంతాలకు రావాల్సిన నీళ్లు రాకుండా ఆపడం విచారకరమన్నారు. సాగు, తాగునీరు ఇవ్వాలన్నారు. నాయకులు మహేష్, రాజు, నాగరాజ్, వినోద్ పాల్గొన్నారు.

ఆర్‌డిటి కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం

- ఇఒఆర్‌డి బాలన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

పైపులైను ద్వారా నీటి సమస్యకు పరిష్కారం

మండలంలోని నేమకల్ ఆర్‌డిటి కాలనీలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపినట్లు ఇఒఆర్‌డి బాలన్న తెలిపారు. శనివారం సర్పంచి ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో మెయిన్ పైపులైన్ నుంచి ఆర్‌డిటి కాలనీ వరకు నూతన పైపులైన్ వేయించి నీటి సమస్యను పరిష్కరించారు. ఆర్‌డిటి కాలనీవాసులు సర్పంచికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇఒఆర్‌డి బాలన్న మాట్లాడుతూ... పంచాయతీ నిధుల ద్వారా నూతన పైపులైను వేయించామన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నామన్నారు.

ఆలస్యంగా ప్రారంభమైన సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఆస్పరి

ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సర్వసభ్య సమావేశం ఆలస్యంగా 12 గంటలకు ప్రారంభమైంది. ఎమ్మెల్యే రాకతో ఎంపిపి సుంకర ఉమాదేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశం ఉద్దేశం గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి, నెలకొన్న సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కారానికి దోహదపడాలి. ఈ సమావేశం సర్వసభ్య సమావేశంగా కాక వైసిపి నాయకులు, కార్యకర్తల సమావేశంగా తలపించింది. సర్పంచులు, ఎంపిటిసిలు హాజరు కావాల్సిన సమావేశానికి వారి భర్తలు, కొడుకులు హాజరయ్యారు. కొంతమంది ఎంపిటిసిలు, సర్పంచులు సమావేశానికి డుమ్మా కొట్టారు.

సమావేశానికి హాజరయిన ప్రజాప్రతినిధులు

మాట్లాడుతున్న డాక్టర్ సత్యవతి

స్థాయికి మించి వైద్యం చేస్తే

ఆర్‌ఎంపిలపై కఠిన చర్యలు

- డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సత్యవతి

ప్రజాశక్తి - గోనెగండ్ల

సరైన అర్హతలు, అనుమతులు లేకుండా స్థాయికి మించి వైద్యం చేస్తే ఆర్‌ఎంపిలపై కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సత్యవతి, గోనెగండ్ల సిఐ రామకృష్ణయ్య హెచ్చరించారు. శనివారం గోనెగండ్లలోని ఎంపిడిఒ సమావేశ భవనంలో మండలంలోని ఆర్‌ఎంపిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆర్‌ఎంపిలు క్లినిక్‌లకు ప్రథమ చికిత్స కేంద్రమని బోర్డు పెట్టుకొని ఒపి మాత్రమే చూడాలని, ఇన్ పేషెంట్లుగా చేర్చుకోరాదని తెలిపారు. మాత్రలు, సిరప్‌లతోనే వైద్యం చేయాలని చెప్పారు. గర్భిణులకు వైద్యం, కాన్పులు చేయరాదని తెలిపారు. యాంటీ బయాటిక్ ఇంజెక్షన్లు, సెలైన్ ఫ్లూయిడ్స్ ఎక్కించరాదని సూచించారు. ఆర్‌ఎంపిలు వైద్యం చేస్తున్నప్పుడు మరణం సంభవిస్తే సెక్షన్ 302 కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా ఎఫ్‌డిపి నోడల్ ఆఫీసర్ డాక్టర్ బాలమురళీకృష్ణ, గోనెగండ్ల డిడిఒ రంగ రవళి, మెడికల్ ఆఫీసర్ కార్తీక్, సంఘం నాయకులు ఉస్మాన్ నాగేశ్వరరెడ్డి, హనీఫ్ పాల్గొన్నారు.

'విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయండి'

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని పూలచింత, గంగవరం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి గ్రామాల విద్యార్థులకు విద్యార్థి బడి బస్సు సౌకర్యం కల్పించాలని పిఎస్‌యు నాయకులు కోరారు. శనివారం పిఎస్‌యు జిల్లా కార్యదర్శి సురేష్ డిఎం బి.అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మిగనూరు పట్టణ అధ్యక్షులు విష్ణు, నాయకులు విద్యార్థులు భూపాల్, అంజి, రవి, కార్తీక్, నవీన్, తరుణ్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జికోర్టులో
(JFGM)
O.S.No.777/2023
కె.ఇ.జగదీష్ గౌడ్. ...వాది
-VS-
జి.శ్రీకాంత్ తండ్రి జి.క్రిష్ణయ్య
వ్యాపారం, ఇంటి నెం.87-1268,
నాగిరెడ్డి రెవెన్యూ కాలని, కల్లూరు,
కర్నూలు (జిల్లా). ...ప్రతివాది
ప్రతివాదికి దావా సమన్లు
పై నెంబరు దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తము రూ॥8,50,000/- ముందు వడ్డి, కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినారు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఆక్షేపణఉన్న 20-08-2024 తేది పగలు : 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
ఎ. సుధాకర్,
కె. కృష్ణమోహన్ రెడ్డి,
వాదిపరం అడ్వకేట్,
కర్నూలు.